లక్ష్మీనారాయణకు మే డే పురస్కారం


లక్ష్మీనారాయణకు పురస్కారం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

అబిడ్స్: హైదరాబాద్ మెట్రో వాటర్‌బోర్డు ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్. లక్ష్మీనారాయణకు మే డే పురస్కారం–2025ను సీఎం రేవంత్‌రెడ్డి అందజేశారు. కార్మికుల కోసం, ఉద్యోగుల కోసం 30 ఏళ్లుగా విశేష సేవలందజేస్తున్న లక్ష్మీనారాయణకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ..కార్మికుల సంక్షేమం కోసమే తన జీవితాంతం కృషి చేస్తానన్నారు. కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నట్లు వివరించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


సరుకులు అందజేస్తున్న మహ్మద్ ఫహాద్

గోల్కొండ: గత దశాబ్ద కాలంగా పీస్ ఫోర్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నామని పీస్ ఫోర్స్ సొసైటీ కార్యాలయ ప్రతినిధి మహ్మద్ ఫహాద్ అన్నారు. సొసైటీ చైర్మన్ మహ్మద్ సూచనల మేరకు గురువారం ఆయన టోలిచౌకీలోని కార్యాలయంలో నిరుపేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సేవా కార్యక్రమాల్లో పీస్ ఫోర్స్ సొసైటీ ఎప్పుడు ముందుందన్నారు. మును ముందు కూడా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.

మోదీ పాలనలో అగ్రరాజ్యంగా భారత్


తెలంగాణ బీజేపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్‌తో దేవర వంశీ తదితరులు

గోల్కొండ: మోదీ పాలనలో మన దేశం ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా ఎదుగుతుందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవర శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు గురువారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జన గణనతో పాటు కుల గణన కూడా చేస్తామని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అత్యుత్తమమైనదన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ 20 ఏళ్లు వెనక్కిపోయిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ, విదేశీ పర్యటనలు చేస్తూ అభివృద్ధిని మరిచారన్నారు. వెంకటేష్, ప్రభుపూజారి, ఉమారాణి తదితరులున్నారు.

సమాజ శ్రేయస్సుకు యాదవ అహీర్ సమాజ్ కృషి


ఉచిత అహీర్ సమాజ్ వివాహ వేడుకల్లో నిర్మల్ కుమార్ యాదవ్

అబిడ్స్: సమాజ శ్రేయస్సుకు యాదవ అహీర్ సమాజ్ నిరంతరం కృషి చేస్తోందని ఆ సమాజ్ రాష్ట్ర నేత, ఆల్ ఇండియా కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో యాదవ అహీర్ సమాజ్ ఉచితంగా సామూహిక వివాహాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..తమ అహీర్ సమాజ్ ఆధ్వర్యంలో ఉచితంగా సామూహిక వివాహాలు నిర్వహించి పేద ప్రజలకు అండగా ఉంటున్నామన్నారు.

ఘనంగా కార్మిక దినోత్సవం

అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో గురువారం ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని (మే డే) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ఎర్ర జెండాలను ఆవిష్కరించి మే డే శుభాకాంక్షలు తెలియజేశారు. పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు.

– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



ఏక్తా జనశక్తి ఫౌండేషన్ ర్యాలీలో పాల్గొన్న కార్మికులు


మే డే వేడుకల్లో పాల్గొన్న నాయకులు


నిలోఫర్‌లో మాట్లాడుతున్న డాక్టర్ రవికుమార్


వేడుకల్లో దయానంద్ వెజిటబుల్ మార్కెట్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ కుమార్


జియాగూడ మేకల మండిలో.. బీఆర్ఎస్ ఇన్‌చార్జి జీవన్‌సింగ్, నరహరి చారి, దిలీప్‌కుమార్, బాబు


బేగంబజార్‌లో.. సీఐటీయూ సీనియర్ నాయకులు నాగేశ్వర్, జంగయ్య


ఉప్పుగూడలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఆకుల శ్రీనివాస్

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


కమిషనర్‌కు బొకేను అందజేస్తున్న ఆదిల్ షరీఫ్

అబిడ్స్: జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ జీహెచ్‌ఎంసీ ఐఎన్‌టీయూసీ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ ఆధ్వర్యంలో కలిశారు. నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనను గురువారం ఆదిల్ షరీఫ్, ఇతర నాయకులు ఏపీఎస్ గాంధీ, మోజస్‌లతో పాటు పలువురు నేతలు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ..పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల అభ్యున్నతికి తమ యూనియన్ ఎల్లవేళల కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, కోడారి రాజు, ఎల్.మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం


గుడిమల్కాపూర్ చౌరస్తా వద్ద పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు


పాలాభిషేకం చేస్తున్న బీజేపీ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ తదితరులు

గోల్కొండ: జన గణనతో పాటు కుల గణన కూడా నిర్వహిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ, దాని అనుబంధ విభాగం వారు గురువారం గుడిమల్కాపూర్ పూలే విగ్రహం వద్ద ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కుల గణన చేయించడం ప్రధాని నరేంద్రమోదీ సమర్థ పాలనకు, సాహసోపేతమైన నిర్ణయాలకు నిదర్శనం అని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. బీజేపీ నాయకులతో కలిసి ఆయన ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆయన వెంట బీజేపీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జీ టి.అమర్‌సింగ్, డిజ్వర్‌సింగ్, సాగర్, యాదగిరి తదితరులున్నారు. అదే విధంగా ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్‌లో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా గోల్కొండ జిల్లా అధ్యక్షుడు చెరుకుల ఉదయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింగ్‌రావు, శివరత్నం, గోవర్ధన్, సుధాకర్‌యాదవ్, జగదీష్ తదితరులున్నారు.

జాంబాగ్‌లో...

సుల్తాన్‌బజార్: ప్రధాని నరేంద్రమోదీ కులగణను ప్రారంభిస్తున్న నేపథ్యంలో జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ నేతృత్వంలో గురువారం నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..దేశంలో నరేంద్రమోదీ నాయకత్వంలోనే దేశ రక్షణ ఉంటుందన్నారు. దేశ పరిస్థితులను బట్టి నరేంద్రమోదీ సాహసంతోనే ప్రపంచ దేశాలకు భారత్ అంటే నమ్మకం కలిగిందన్నారు. కులగణనకు ప్రజలు సహకరించాలని కోరారు.

కుల గణన నిర్ణయం చరిత్రాత్మకం


పారసాని వెంకటేష్

చార్మినార్: ప్రధాని నరేంద్ర మోదీ జనాభా లెక్కలతో పాటు కుల గణనను శాస్త్రీయంగా చేపట్టడానికి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని బీజేపీ ఓబీసీ మోర్చా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ప్యారసాని వెంకటేష్ అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేబినెట్ మంత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ 60 ఏళ్లల్లో ఒక్కసారి కూడా కులగణన చేపట్టక పోవడం దారుణమన్నారు. 1931లో చివరిసారి బ్రిటిష్ ప్రభుత్వం కులగణన చేసిందన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో వేసవి శిక్షణా శిబిరం

యాకుత్‌పురా: సుల్తాన్‌షాహిలోని శాలిబండ ప్రభుత్వ జీజీహెచ్‌ఎస్ పాఠశాలలో 15 రోజుల పాటు నిర్వహించనున్న ఉచిత వేసవి శిక్షణా శిబిరాన్ని గురువారం బహదూర్‌పురా డిప్యూటీ ఐఓఎస్, ప్రధానోపాధ్యాయుడు హరినారయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సమగ్ర పీఎం శ్రీ పథకం, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకు 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు డ్రాయింగ్, సంగీతం, ఆర్ట్స్ పలు క్రీడాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్ భాస్కర్, రవి కాంత్, నవనీత తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీ


చాంద్రాయణగుట్టలో సన్న బియ్యం పథకాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చాంద్రాయణగుట్ట: రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సన్న బియ్యం ఇవ్వడం ఎంతో గొప్పవిషయమని టీపీసీసీ కార్యదర్శి బి.వెంకటేష్ ముదిరాజ్ అన్నారు. చాంద్రాయణగుట్టలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేష్ ముదిరాజ్ మాట్లాడుతూ..గత నెలలోనే ఈ పథకం ప్రారంభమైనప్పటికీ, ఎన్నికల కోడ్ కారణంగా హైదరాబాద్‌లో ఈ నెల ప్రారంభమయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నకేశవ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఎ.మహేష్ గౌడ్, నాయకులు మోహన్‌రెడ్డి, ఆర్.రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు నష్టం వాటిల్లకుండా చూడాలి


మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో మాట్లాడుతున్న గాజుల అంజయ్య తదితరులు

చార్మినార్: పాతబస్తీలో చేపట్టిన మెట్రో రైల్ పనుల్లో భాగంగా పురాతన ఆలయాలకు నష్టం వాటిల్లకుండా చూడాలని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు గాజుల అంజయ్య మెట్రో అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన ఉమ్మడి ఆలయాల కమిటీ ప్రతినిధులతో కలిసి గురువారం హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డిని కలిసి పాతబస్తీలో చేపడుతున్న మెట్రో రైల్ పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంజీబీఎస్ నుంచి మీరాలంమండి, అలిజా కోట్ల, హరిబౌలి, అలియాబాద్ మీదుగా చాంద్రాయణగుట్ట వరకు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంలో ఆలయాలకు ఎటువంటి నష్టం కలగకుండా పనులు నిర్వహించాలని కోరినట్లు తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు ప్రవీణ్, వినోద్, ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి ప్యారసాని వెంకటేష్, కోట మైసమ్మ ఆలయ అధ్యక్షుడు నాయికోటీ బాబు రాజా, కార్యదర్శి విజయ్ గౌడ్, దర్బార్ మైసమ్మ ఆలయ అధ్యక్షులు నరేష్, ధర్మతేజ పాల్గొన్నారు.

పాతనగర మున్నూరు కాపుల సంక్షేమమే ధ్యేయం


నూతన అధ్యక్షుడు పల్లె శ్రవణ్ కుమార్‌తో సంఘం ప్రతినిధులు

గౌలిపురా: పాతనగర మున్నూరు కాపు సంఘం సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు, న్యాయవాది మణికొండ వెంకటేశ్వర రావు హాజరయ్యారు. ఇటీవల నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన పల్లె శ్రవణ్ కుమార్ బాధ్యతలను స్వీకరించారు. పాతనగర మున్నూరు కాపు సంఘం సంస్థాపక అధ్యక్షుడు, సలహాదారులు ఆకుల శ్రీరాములు ఎన్నికైన నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా పల్లె శ్రవణ్‌కుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మడిగల భాస్కర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా సుంకరి వేణు, కోశాధికారి మామిడి నర్సింగ్‌రావు, పదాధికారులు, కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ..పాతనగర మున్నూరు కాపుల సంక్షేమమే ధ్యేయంగా నూతన కమిటీ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాతనగర మున్నూరు కాపు సంఘం సలహాదారులు డి.ప్రభాకర్, జీవితకాల సభ్యులు, సలహాదారులు, మహాసభ నాయకులు నూతన కార్యవర్గాన్ని ఆశీర్వాదించారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న గిరిధర్ నాయక్

చాంద్రాయణగుట్ట: జంగమ్మెట్ డివిజన్ రవీంద్రనాయక్ నగర్‌లోని డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సభావత్ గిరిధర్ నాయక్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన బండ్లగూడ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ ఇళ్లను అర్హులైన వారికి అందించడం జరిగిందన్నారు. కానీ ప్రస్తుతం అందులో తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ తదితర సమస్యల కారణంగా ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇళ్లను స్వాధీనం చేసుకుంటామంటూ మరోవైపు ఆర్డీఓ నోటీసులివ్వడంపై లబ్ధిదారులు ఆందోళనలకు గురవుతున్నారన్నారు. నాయకులు జె.రాము నాయక్, కుమార్ నాయక్, సూర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు భావితరాల నిర్మాతలు


ఉత్తమ ఉపాధ్యాయులతో డాక్టర్ పి.వి. శ్రీనివాసరావు, సాయిబాబాచారి తదితరులు

గోల్కొండ: ఉపాధ్యాయులు భావితరాల నిర్మాతలని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరై గోల్కొండ ఉర్దూ హైస్కూల్‌లో ఉత్తమ టీచర్లకు మెమెంటోలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..మన దేశంలో అనాదినుంచి గురువులకు అత్యున్నత స్థానం ఉందన్నారు. ఉర్దూ హైస్కూల్ రెండు దశాబ్దాలుగా నిరుపేద విద్యార్థులకు చదువులు చెబుతూ తీర్చిదిద్దిందన్నారు. ఈ కార్యక్రమంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సేవా సమితి అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి, శ్రీ గోల్కొండ జగదాంబిక మహంకాళి వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి, మహంకాళి ఆలయ పూజారి బి.సురేష్‌చారి, ఉర్దూ హైస్కూల్ సీనియర్ ఫ్యాకల్టీ అస్మాత బస్సుం తదితరులున్నారు.

సమాజ చైతన్యం కాంక్షించే సాహిత్యం రావాలి


మాట్లాడుతున్న అరసం నగర శాఖ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్‌గౌడ్

గౌలిపురా: హనుమాన్‌నగర్ జ్ఞాన భారతి మోడల్ స్కూల్‌లో అభ్యుదయ రచయితల సంఘం హైదరాబాద్ నగర శాఖ ఆధ్వర్యంలో 139వ మే డేను పురస్కరించుకొని సమాజంలో కవుల పాత్ర అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి కవులు పాల్గొని తమ కవిత వినిపించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ప్రముఖ ఆధ్యాత్మిక అభ్యుదయ సామాజికవేత్త, నాంపల్లి వొకేషనల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎర్రబైరి సురేందర్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. సమాజ చైతన్యానికి నేడు కవులు, కళాకారుల పాత్ర కీలకమైందన్నారు. ఈ కార్యక్రమానికి అరసం నగర శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. సూర్యప్రకాశ్ అధ్యక్షతన వహించారు. గౌరవ అతిథిగా అరసం నగర శాఖ ప్రధాన కార్యదర్శి జి.చంద్రమోహన్ గౌడ్ పాల్గొని ప్రసంగించారు. జ్ఞాన భారతి మోడల్ హైస్కూల్ కరస్పాండెంట్ ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. సమాజ హితం కోరే కార్యక్రమాలకు మా సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అరసం నగర శాఖ కోశాధికారి, న్యాయవాది అటుకుల రాజు, సీనియర్ అరసం (ఏఐఎస్ఎఫ్) నాయకుడు ఎస్.ఆర్.శ్రీనివాస్, ఐటీయూసీ సీనియర్ నాయకుడు హెచ్.అశోక్‌తో పాటు సాహెబ్, జాద విశాల్, పున్నయ్య, సంతోష్, ప్రభాకర్, జి.మల్లేష్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జెండా కర్రను కూల్చివేసిన దుండగులను శిక్షించాలి


లాల్ దర్వాజా మోడ్ వద్ద కూల్చివేసిన పార్టీ జెండా కర్ర

చార్మినార్: లాల్ దర్వాజా మోడ్‌లోని మా పార్టీ జెండా కర్రను ఎవరో గుర్తు తెలియని దుండగులు కూల్చివేశారని..నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు మొగల్‌పురా డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పుష్పాల రాధాకృష్ణ తెలిపారు. ఈ మేరకు గురువారం మొగల్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. తమ పార్టీ అధికారంలో ఉన్నప్పటి నుంచి లాల్‌దర్వాజా మోడ్ వద్ద తమ పార్టీ దిమ్మెతో పాటు జెండా కొనసాగుతుందన్నారు. గత నెల 27న పార్టీ రజతోత్సవాల సందర్భంగా కూడా ఇక్కడ పార్టీ పతాకావిష్కరణ కూడా చేశామన్నారు. ఉద్దేశపూర్వకంగా పార్టీ జెండాను తొలగించిన దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

'పది'లో ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ


ఫిర్దస్ అక్బర్ కరచీ


నేహ షేహనాజ్


మహ్మద్ అశ్రఫ్

యాకుత్‌పురా: పదో తరగతి పరీక్షల్లో యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట అశ్రయ్ ఆకృతి ప్రత్యేక బధిర పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలలో మొత్తం 19 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఇందులో నేహ షేహనాజ్ , మహ్మద్ అశ్రఫ్, ఫిర్దస్ అక్బర్ కరచీ 88 శాతం మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారని పాఠశాల డైరెక్టర్ డీపీకే బాబు తెలిపారు. మిగత 16 మంది విద్యార్థులు 80 శాతం మార్కులు సాధించారన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు డైరెక్టర్ బాబుతో పాటు పాఠశాల ఇన్‌చార్జి సయ్యద్ ఇంతీయాజ్ మెహదీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.


మల్లేశ్వరీ యాదవ్


ఫాతిమా బేగం


సమియా ఫాతిమా


సిరసత్ స్నేహా

సత్తా చాటిన ప్రభుత్వ మహబూబియా స్కూల్ విద్యార్థినులు..


అనిత

గన్‌ఫౌండ్రీ: పదో తరగతి ఫలితాల్లో గన్‌ఫౌండ్రీలోని ప్రభుత్వ మహబూబీయా పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. నాంపల్లి మండలంలోనే అత్యధిక మార్కులు పొందారు. ఎలుగు మల్లేశ్వరీ యాదవ్ 543 మార్కులు సాధించగా ఫాతిమా బేగం 540 మార్కులు, సనియా ఫాతిమా 525, సిరాసత్ స్నేహ 527, కె. అనిత 510 మార్కులు సాధించారు. ఈ ఏడాది 88 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 82 మంది ఉత్తీర్ణత సాధించారు. 93 శాతంతో ఈ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు సత్తాను చాటారు.